సాక్షి అనంతపురం

శనివారం । 3 । మే । 2025



చీనీ టన్ను రూ.22,100

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,100 పలికాయి. కనిష్టం రూ.4 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు

ఉరవకొండ నియోజకవర్గంలో కీలక శాఖలకు రెగ్యులర్ అధికారులు లేరు. ఇన్‌చార్జ్‌ల పాలనలో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలందడం లేదు. 10లో

గరిష్ఠం/కనిష్ఠం
41.2°/24.7°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

8 నుంచి పీజీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 8న ప్రారంభం కానున్నాయని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. పీజీ పరీక్షలు ఈ నెల 13న ముగుస్తాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా యూజీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను ఆయన పర్యవేక్షించారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలోని నాలుగు డిగ్రీ కళాశాలలను తనిఖీ చేశారు.

17న జేఎన్‌టీయూ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- 40 మంది విద్యార్థులకు బంగారు పతకాలు
- స్నాతకోత్సవ నిర్వహణకు ప్రత్యేక కమిటీల నియామకం



జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం

అనంతపురం: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం (జేఎన్‌టీయూ–ఏ) స్నాతకోత్సవం ఈ నెల 17న నిర్వహించనున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ చాన్సలర్, ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో బీటెక్, బీ ఫార్మసీ, ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎమ్మెస్సీ పూర్తి చేసిన విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలు అందజేస్తారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి డాక్టరేట్ ప్రదానం చేస్తారు. ముఖ్య అతిథిగా చాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. బంగారు పతకాలకు ఎంపికైన వారికి గవర్నర్ అందజేస్తారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందజేస్తారు. గౌరవ డాక్టరేట్ ఎవరికి అందించాలనే అంశంపై మూడు పేర్లతో కూడిన జాబితాను గవర్నర్‌కు పంపారు. త్వరలోనే గౌరవ డాక్టరేట్ పేరు ఖరారు కానుంది. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోనూ, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలో టాపర్లు బంగారు పతకాలకు ఎంపికయ్యారు. స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా 17 కమిటీలను నియమించారు. ఇందులో ప్రొఫెసర్లను నియమించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు కమిటీలను నియమించినట్లు వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు తెలిపారు.

బ్యాంకులకూ కష్టాలే

జిల్లాలో గృహ రుణాల పరిస్థితి..

2023-24లో గృహ రుణాలు	855
గృహ రుణాల విలువ	రూ.213 కోట్లు
సగటున ఒక్కో గృహరుణం	రూ.25 లక్షలు
2024-25లో గృహ రుణాలు	269
గృహ రుణాల విలువ	రూ.67.25 కోట్లు



రియల్ ఎస్టేట్ ఢమాల్ ఎఫెక్ట్..

- భారీగా పడిపోయిన హౌసింగ్ లోన్లు
- గత ఏడాదితో పోలిస్తే 68 శాతం తగ్గుదల
- గృహరుణాలకు డిమాండ్ లేక కార్ల లోన్లపై బ్యాంకుల దృష్టి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) రంగంలో అనిశ్చితి ప్రభావం బ్యాంకుల పైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. గృహ రుణాల కోసం వచ్చేవారు బాగా తగ్గిపోవడంతో ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ప్రైవేట్ బ్యాంకింగ్ సంస్థలూ విలవిలలాడుతున్నాయి. ఏ బ్యాంకులైనా ఆర్థికంగా మనగలగాలంటే హౌసింగ్ రుణాలే కీలకం. అలాంటిది ఈ ఏడాది నామమాత్రంగా కూడా లేకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ఎప్పుడూ లేని విధంగా మార్కెటింగ్ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పంపిస్తున్నా రుణాల కోసం ఎవరూ ముందుకు రావడం లేదని తేలింది.

68 శాతానికి పైగా తగ్గుదల..

2023–24 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2024–25 సంవత్సరంలో 68 శాతానికి పైగా గృహరుణాలు తగ్గినట్టు తేలింది. నిర్మాణ రంగం పూర్తిగా తగ్గిపోవడంతో గృహ రుణాలపై ప్రభావం పడింది. జిల్లాలో ప్రధానంగా అనంతపురం కేంద్రంగా గృహ నిర్మాణాలు ఎక్కువగా ఉంటాయి. ఆ తర్వాత తాడిపత్రి, గుంతకల్లు కీలకం. ఇక్కడ ఈ ఏడాది నిర్మాణాలు పూర్తిగా పడిపోయాయి. కొత్తగా నిర్మాణాలు కాకపోగా.. పాతగా కట్టిన వాటికి రుణాల కోసం ఎవరూ ముందుకు రావడం లేదు. అసలు రిజిస్ట్రేషన్లే స్తబ్దుగా ఉన్నప్పుడు ఇక గృహ రుణాలకు ఎవరొస్తారని అనుకుంటున్నారు.



కార్ లోన్లపై బ్యాంకుల దృష్టి..

గృహ రుణాలు సరిగా లేకపోవడంతో పలు బ్యాంకులు కారు లోన్లపై దృష్టి సారించాయి. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలు కూడా ఇప్పుడు కార్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు బ్యాంకులతో పాటు కార్ల షోరూమ్‌ల ప్రతినిధులు శరపరంపరగా ఫోన్‌లు చేస్తున్నారు. బ్యాంకింగ్ సిబ్బంది ఏకంగా ప్రభుత్వ ఆఫీసులకు వెళ్లి మార్కెటింగ్ చేస్తున్నారు. ఈ ఏడాది విదేశీ విద్యా రుణాలు కూడా భారీగా తగ్గినట్టు బ్యాంకర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది అమెరికా వెళ్లే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని, దీంతో రుణాల రేటు కూడా తగ్గిందని చెబుతున్నారు.

లోన్లు తీసుకునేవారేరీ?

ఇరవై ఏళ్లుగా స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) రంగాన్నే నమ్ముకుని ఉన్నాను. స్థలాలు, ఇళ్లు ఎన్నో కొనిచ్చాను.. అమ్మించాను. కానీ పది నెలలుగా బ్యాంకులు లోన్లు ఇస్తామని ముందుకొస్తున్నా కొనేవారు లేరు. నిర్మాణం పూర్తయిన చాలా ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. పరిస్థితి ఘోరంగా ఉంది. నాలాంటి ఎంతో మంది కుటుంబాలు గడవక ఇబ్బంది పడుతున్నారు.



– అల్లాబకాష్, రియల్ ఎస్టేట్ వ్యాపారి

మార్కెట్ పరిస్థితులు బాగోలేవు

గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో హోం లోన్లు తగ్గాయి. మార్కెట్ పరిస్థితులు సానుకూలంగా లేకపోవడం వల్ల ఇలా జరిగింది. మా ఒక్కరికే కాదు అన్ని బ్యాంకుల పరిస్థితీ అంతే. హౌసింగ్ లోన్లతో పోలిస్తే కార్ లోన్లు కొంచెం ఫరవాలేదు.



– కె.రమేష్‌బాబు, రీజనల్ మేనేజర్, ఎస్‌బీఐ

చిన్నారిని మింగిన కరెంటు

- క్రికెట్ బాల్ కోసం వెళ్లి విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి
- కుమారుడి మరణవార్తతో జైలులో ఉన్న తండ్రి వాల్మీకి లోకేష్‌కు అస్వస్థత
- హుటాహుటిన ఆస్పత్రికి తరలించిన జైలు అధికారులు



మృతి చెందిన బాలుడు అశ్విన్ ఆరాధ్య

హిందూపురం: పాఠశాల భవనంపై పడిన క్రికెట్ బాల్‌ను తీసుకునేందుకు వెళ్లిన ఓ విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం హిందూపురం ముదిరెడ్డి పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...ముదిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వాల్మీకి లోకేష్ కుమారుడు అశ్విన్ ఆరాధ్య (11) శుక్రవారం సాయంత్రం మిత్రులతో కలిసి క్రికెట్ ఆడుకుంటూ ఉన్నాడు. ఈ క్రమంలో బాల్ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం పైన పడింది. బాల్‌ను తీసుకువచ్చేందుకు అశ్విన్ ఆరాధ్య భవనం పైకి వెళ్లాడు. గతరాత్రి కురిసిన వర్షంతో భవనం మొత్తం తడిగా ఉండటం...బాల్ తీసుకునే క్రమంలో సమీపంలోని విద్యుత్ తీగలు తగలడంతో అశ్విన్ ఆరాధ్య గట్టిగా కేక వేసి అక్కడే పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు పరుగున వెళ్లి బాలుడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై హిందూపురం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జైలులో అస్వస్థతకు గురైన తండ్రి

టీడీపీ నేతలు పెట్టిన అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న అశ్విన్ ఆరాధ్య తండ్రి వాల్మీకి లోకేష్ కుమారుడి మరణవార్త విని కన్నీరుమున్నీరయ్యాడు. కుమారుడిని తలచుకుని జైలులో కుప్పకూలిపోయాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన్ను జైలు అధికారులు హుటాహుటిన జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



అనంతపురం టవర్‌క్లాక్ వద్ద పడిపోయిన డివైడర్లు

హోరుగాలి.. జోరువాన



అనంతపురం నగరంలో వర్షంలోనే రాకపోకలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో పలు చోట్ల గాలీవాన బీభత్సం సృష్టించింది. అనంతపురంలో శుక్రవారం రాత్రి హోరుగాలికి ఎక్కడికక్కడ హోర్డింగులు పడిపోయాయి. ఫ్లెక్సీలు చిరిగి ఎగిరిపోయాయి. రోడ్డు మధ్యలో పోలీసులు ఏర్పాటు చేసిన డివైడర్లు కిందపడిపోయాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ తీగలు తెగాయి. కాసేపు ఉరుములు, మెరుపులతో జోరుగా వర్షం పడటంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. రెండు గంటలకు పైగా నగరం, పరిసర ప్రాంతాలు అంధకారం అలుముకున్నాయి. చీకట్లలోనే అతికష్టం మీద వాహనాలు రాకపోకలు సాగించాయి. అనంతపురంలో 20 మి.మీ వర్షం నమోదైంది. పెద్దపప్పూరు, శింగనమల మండలాల్లో 15 మి.మీ, నార్పల, వజ్రకరూరులో 10, యల్లనూరు, బెళుగుప్ప, కళ్యాణదుర్గం, ఉరవకొండ, పామిడి, తాడిపత్రి, యాడికి, పుట్లూరు, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలాల్లో 6.మి.మీ.లోపు వర్షం కురిసింది. గంటకు 25 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి.

వాసవీమాతకు లక్ష గాజులతో పూజలు



విశేష అలంకరణలో కన్యకాపరమేశ్వరి మూలవిరాట్

హిందూపురం: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి మూలవిరాట్‌ను స్వర్ణతోరణ కవచధారణ చేసి విశేష పూజలు చేశారు. అలాగే వాసవీమాత జయంత్యుత్సవాల్లో భాగంగా వాసవీమాత విగ్రహానికి వందలాది మంది మహిళలు గాజులతో పూజలు చేశారు. అంతకుముందు ఆలయంలో కలశస్థాపన, గోపూజ, సువర్ణ వాసవీమాత విగ్రహ ప్రాణప్రతిష్ఠ, నవగ్రహ పూజ, మృత్యుంజయ హోమం నిర్వహించారు. వాసవీ భజన బృందం సభ్యులు అమ్మవారికి లక్ష గాజులతో పూజలు చేశారు.

దొడగట్టలో ఎలుగుబంట్ల దాడి



దాడిలో గాయపడిన నల్లబోతుల శ్రీనివాసులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్టలో గురువారం అర్ధరాత్రి ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న నల్లబోతుల శ్రీనివాసులు, గొల్ల కర్రెన్నలపై ఎలుగుబంట్లు విచక్షణా రహితంగా దాడి చేశాయి. కుటుంబ సభ్యులు వెంటనే తేరుకొని గట్టిగా కేకలు వేయగా అక్కడి నుంచి పక్కనే ఉన్న గుట్టలోకి పరుగులు తీశాయి. గాయపడిన వారికి వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం మెరుగైన చికిత్సనిమిత్తం వారిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

పరేషాన్



ఉరవకొండలో కొండప్ప బావి వద్ద రేషన్ కోసం క్యూలో సంచులు పెట్టి వేచి ఉన్న లబ్ధిదారులు

ఉరవకొండ: కూటమి పాలనలో కార్డుదారులు రేషన్ పొందడం గగనమవుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే కార్డుదారులకు రేషన్ కష్టాలు మొదలవుతున్నాయి. స్టోర్ల వద్ద పడిగాపులు కాసినా బియ్యం అందని దుస్థితి. ఉరవకొండ పట్టణంలోని పలువురు డీలర్లు ఒక్క రోజు మాత్రమే రేషన్ పంపిణీ చేసి స్టాక్ అయిపోయిందని చెబుతుండటంతో కార్డుదారులు కంగుతింటున్నారు. కొండప్పబావి వద్ద ఉన్న ఓ రేషన్ షాపు వద్ద శుక్రవారం తెల్లవారుజాము 5 గంటల నుంచే క్యూలో కార్డులు పెట్టి వేచి ఉన్నారు. వారిలో 50 శాతం మంది కార్డుదారులకు బియ్యం అందలేదు. రేషన్ ఇవ్వకపోతే తామెలా బతికేది అంటూ అసహనం వ్యక్తం చేశారు.

కష్టాలు ఇంతింతై..



రెండు మంచాలపై నలుగురు బాలింతలు ఇబ్బంది పడుతున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సౌకర్యాల కొరత పట్టి పీడిస్తోంది. గైనిక్ విభాగంలో నాలుగు యూనిట్లకు గాను 120 పడకలు ఉన్నాయి. జిల్లా నలుమూలల నుంచి చాలావరకు కేసులు సర్వజనాస్పత్రికి వస్తున్నాయి. గైనిక్, లేబర్, ఆంటినేటల్ తదితర విభాగాల్లో 250 పడకల్లో గర్భిణులు, బాలింతలు ఉంటున్నారు. పడకలు చాలక ఒకే మంచంపై ఇద్దరు ఉండాల్సి వస్తోంది. పురిటి నొప్పులతో అవస్థలు పడి వచ్చిన బాలింతలు తమ చంటి బిడ్డలను వెంటబెట్టుకుని బెడ్ కోసం ఎదురు చూడాల్సిన దయనీయమైన పరిస్థితి నెలకొంది. ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు చేసి మాతా శిశు సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రయాణికుల బేజారు

- అమరావతికి బస్సుల కేటాయింపు
- ప్రత్యామ్నాయం చూపడంలో ఆర్టీసీ విఫలం
- బస్సుల కోసం ప్రయాణికులకు తప్పని నిరీక్షణ



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



సీట్ల కోసం పాట్లు

అనంతపురం సెంట్రల్: ప్రయాణికులకు ఆర్టీసీ సంస్థ చుక్కలు చూపించింది. సర్వీసులను రద్దు చేసి.. ప్రత్యామ్నాయం చూపకుండా ఇబ్బందులు కలిగించింది. గంటల తరబడి నిరీక్షించినా తమ రూట్ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఉసూరుమన్నారు. ఏపీ రాజధాని పునర్నిర్మాణంలో భాగంగా వివిధ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేసిన నేపథ్యంలో సభకు భారీగా జన సమీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు అందాయి. అంతే అధికారపార్టీ నేతల మెప్పు కోసం ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా బస్సు సర్వీసులను రద్దు చేశారు. జిల్లాలో అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ ఆర్టీసీ డిపోల నుంచి ఏకంగా 125 బస్సులు విజయవాడ కోసం కేటాయించారు. ఇవి కాకుండా మరో వంద వరకూ ప్రైవేటు ట్రావెల్స్, ప్రైవేటు స్కూల్ బస్సులను బలవంతంగా తరలించారు. వాస్తవంగా స్కూల్ బస్సులు ప్రజాప్రతినిధుల సభలకు కేటాయించడం నిబంధనలకు విరుద్ధం. అయినప్పటికీ రవాణాశాఖ అధికారులు వెళ్లాల్సిందేనని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా నుంచి చాలా మంది స్కూల్ బస్సులలోనే తరలివెళ్లారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో విఫలం..

వేసవి సెలవులు కావడంతో చాలామంది పిల్లలతో కలిసి ఊళ్లకు, విహార యాత్రలకు, దేవస్థానాలకు వెళ్తున్నారు. కొద్ది రోజులుగా ఆర్టీసీ బస్సులకు ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఈ సమయంలో అనేక సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ అనంతపురంతో పాటు అన్ని బస్టాండ్‌లలో గంటల తరబడి ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తూ నిలబడి పోయారు. మధ్యమధ్యలో అరకొర బస్సులు వస్తే సీట్ల కోసం ఎగబడడం, వాదులాడుకోవడం కనిపించింది. అసలు ఏ సర్వీసులు రద్దు చేశారో.. ప్రత్యామ్నాయ బస్సులు ఎన్ని గంటలకు వస్తాయో సమాచారం కూడా డిపో అధికారులు చెప్పకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.

గంటల తరబడి ఎదురుచూపు



అనంతపురం నుంచి ఉరవకొండ వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండుకు వచ్చాను. గంట నుంచి ఎదురు చూస్తున్నా ఒక్క బస్సు కూడా రాలేదు. ఎన్ని గంటలకు వస్తుందో కూడా చెప్పే పరిస్థితి ఇక్కడ లేదు. అత్యవసర పనిపై వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకొని వెళ్తున్నారు.

– హరి, ప్రయాణికుడు

ఇబ్బంది పెట్టడం సరికాదు



ప్రయాణికుల గురించి ఆలోచించకుండా బస్సు సర్వీసులను రద్దు చేయడం మంచిది కాదు. దీని వల్ల అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. చంటిబిడ్డలతో వచ్చిన మహిళల పరిస్థితి దీయనీయంగా ఉంది. అనంతపురం బస్టాండులో రెండు గంటల నుంచి గుంతకల్లు వెళ్లే బస్సులు రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

– వెంకటేష్, ప్రయాణికుడు

ప్రయాణం రద్దు చేసుకున్నా



అత్యవసర పనిపై హైదరాబాద్ వెళ్లాలని వచ్చా. ఇక్కడ చూస్తే ఒక్క బస్సు కూడా లేదు. ఉదయం వేళలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు కూడా తక్కువగా ఉన్నాయి. ఈ సమయంలో ఆర్టీసీ బస్సులే శరణ్యం. అలాంటిది హైదరాబాద్‌కు వెళ్లే సర్వీసును రద్దు చేశామని అధికారులు చెబుతున్నారు. నాలాంటి వాళ్లు చాలామంది ప్రయాణాలను రద్దు చేసుకోవాల్సి వచ్చింది.

– గంగాధర్, ప్రయాణికుడు

క్లుప్తంగా

'మార్కెటింగ్'లో మిశ్రమ ఫలితాలు



అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమైన 2025–26 ఆర్థిక సంవత్సరంలో మొదటి నెలకు సంబంధించి నిర్దేశిత పన్ను వసూళ్లలో మార్కెటింగ్‌శాఖ మిశ్రమ ఫలితాలు సాధించింది. గతానికి భిన్నంగా ఈసారి ఉరవకొండ మార్కెట్ కమిటీ దూకుడు కొనసాగించగా... గుత్తి, తాడిపత్రి, రాప్తాడు తదితర ఐదారు కమిటీలు వెనుకంజలో ఉన్నాయి. జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.13.49 కోట్ల వసూళ్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా... మొదటి నెల ముగిసేనాటికి ఓవరాల్‌గా 10.2 శాతంతో రూ.1.38 కోట్లకు పైగా ప్రగతి సాధించడం గమనార్హం. గతేడాది మొదటి నెలతో పోల్చుకుంటే ఈసారి రూ.19.21 లక్షలు అధికంగా వసూలైనట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి తెలిపారు. మార్కెట్ కమిటీల్లో విజిలెన్స్ చర్యలు మరింత పటిష్టం చేసి లీకేజీలు లేకుండా గడువు లోపు వంద శాతం సాధించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫారంపాండ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన 10,413 ఫారం పాండ్ల నిర్మాణాలను జూన్ మొదటి వారంలోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను డ్వామా పీడీ సలీంబాషా ఆదేశించారు. ఫారం పాండ్ల నిర్మాణాలపై శుక్రవారం ఏపీడీలు, ఏపీఓలతో ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలోని ప్రతి మండలంలో 335 ఫారం పాండ్ల తవ్వకాలు చేపట్టాలన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1,166 ఫారంపాండ్లు పూర్తి కాగా 3 వేల ఫారం పాండ్లు వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులు నిర్దేశిత సమయంలోపు పూర్తి కావాలని ఆదేశించారు.

బీసీ గురుకులాల కన్వీనర్‌గా అప్రత్‌వలి

అనంతపురం ఎడ్యుకేషన్: మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల కన్వీనర్‌గా కొనకొండ్ల గురుకుల పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు జి.అప్రత్‌వలి నియమితులయ్యారు. ప్రస్తుతం కన్వీనర్‌గా పనిచేస్తున్న కేజే జోనాథన్ గత నెల 29న పదవీవిరమణ పొందారు. ఈ క్రమంలో అప్రత్‌వలికి జిల్లా కన్వీనర్‌గా నియమించారు.

ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు

- మంత్రి పయ్యావుల ఇలాకాలో సేవలు అందక ప్రజల ఇబ్బందులు
- కీలక పోస్టులకు అధికారులు లేక కుంటుపడిన పాలన



ఇన్‌చార్జ్ పాలనలో సాగుతున్న కూడేరు తహసీల్దార్ కార్యాలయం

ఉరవకొండ: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు కావడంతో పాలన కుంటుపడింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అన్ని కీలక శాఖలకు రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో పాటు తహసీల్దార్, ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఒక్కొక్కరు రెండేసి మండలాలకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించాల్సి వస్తోంది.

తహసీల్దార్లు లేకపోవడంతో..

ఉరవకొండ రెగ్యులర్ తహసీల్దార్‌గా మహబూబ్ బాషా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కూడేరుకు రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో అయన్ను ఆ మండలానికి ఇన్‌చార్జ్‌గా నియమించారు. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న కూడేరు నుంచి ఉరవకొండకు 25 కిలోమీటర్లు అవుతుండటంతో ఆయన రెండు మండలాలు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. కూడేరులో 8 నెలలుగా తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో పాటు కార్యాలయంలో సీఎస్‌డీటీ, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. అలాగే ఉరవకొండ డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన బోగన్నగౌడ్ కేవలం నెల రోజులు మాత్రమే పనిచేసి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. విడపనకల్లు తహసీల్దార్ సునీతాబాయి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై మరో జిల్లాకు వెళ్లిపోవడంతో తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం సివిల్ సప్లయ్స్ డీటీ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. వజ్రకరూర్ తహసీల్దార్ నయాజ్‌అహ్మద్ ఈనెల 30తో పదవీ విరమణ పొందుతుండటంతో అక్కడ కూడా డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉంది. వజ్రకరూర్‌కు రెగ్యులర్ ఎంపీడీఓ లేకపోవడంతో ఉరవకొండ ఎంపీడీఓ రవిప్రసాద్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఉరవకొండ ఉపాధి హామీ పథకం ఏపీడీ పోస్టు ఖాళీగా ఉండటంతో తాడిపత్రికు చెందిన రెగ్యులర్ ఏపీడీను ఉరవకొండ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. బెళుగుప్ప ట్రాన్స్‌కో ఏఈ గంగధర్ కంబదూరు మండలానికి ఇన్‌చార్జ్ ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రజల అవస్థలు..

నియోజకవర్గంలోని ప్రధాన కార్యాలయాల్లో తహసీల్దార్, ఎంపీడీఓలు లేకపోవడంతో పాలన కుంటుపడింది. ఇన్‌చార్జ్ పాలనతో పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలకు సేవలందక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మంత్రి పయ్యావుల కేశవ్ దీనిపై దృష్టి పెట్టి రెగ్యులర్ ఉద్యోగులను నియమించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇన్‌చార్జుల పాలనతో ఇబ్బందులు



నియోజకవర్గంలో పలు మండలాలకు ఇన్‌చార్జ్ అధికారులే దిక్కుగా మారడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి అధికారులు లేక ముఖ్యంగా వివిధ సర్టిఫికెట్ల మంజూరు కోసం విద్యార్థులు, నిరుద్యోగులు అవస్థలు పడుతున్నారు. మంత్రి పయ్యావుల దీనిపై దృష్టిసారించి రెగ్యులర్ అధికారులను నియమించేలా ఆదేశాలు ఇవ్వాలి.

– బోయ సుశీలమ్మ, మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్, వజ్రకరూరు

సేవలందడం లేదు



ఉరవకొండ తహసీల్దార్‌కు కూడేరు ఇన్‌చార్జ్‌గా కూడా బాధ్యతలు అప్పజెప్పారు. దీంతో ఆయన ఎక్కువ సమయం కూడేరులో ఉండటంతో తహసీల్దార్ కోసం వస్తున్న ప్రజలు నిరాశగా వెనుతిరుగుతున్నారు. దీని వల్ల ప్రజలకు సేవలందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలి.

– నరసింహులు, ఎంపీపీ, ఉరవకొండ

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



ప్రవాసాంధ్రులతో ఆలూరు సాంబశివారెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన విప్లవాత్మక మార్పులతో అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి సాధించిందని, జగనన్న పైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. శుక్రవారం సిడ్నీలో వైఎస్సార్ సీపీ గ్లోబల్ కనెక్ట్ పర్యటన ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రవాసాంధ్రులతో ఆలూరు సాంబశివారెడ్డి సమావేశమై మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో సాధించిన విజయాలపై ప్రవాసాంధ్రులు ఒక్కొక్కరు చేసే ఒక్కో పోస్టుతో కలిసే ఒకమిత్రుడు రాష్ట్ర భవిష్యత్తుకు నాందీగా నిలుస్తాడని అన్నారు. తన పాదయాత్రలో 3,648 కిలోమీటర్లు ఓటు కోసం కాకుండా ప్రతి గుండె చప్పుడు వినడానికి జగనన్న ప్రయత్నించారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలభ్యున్నతి కోసం సచివాలయాల ద్వారా సంక్షేమ పాలన, వైద్య కళాశాలలు, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య విస్తరణతో వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు, నాడు–నేడు, డిజిటల్ తరగతులు, విద్యా దీవెన ద్వారా విద్యారంగంలో ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టి పేదలకు అండగా నిలిచారన్నారు. మరోసారి అలాంటి సువర్ణ పాలనను తీసుకురావడానికి ప్రవాసాంధ్రులు ముందుకురావాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో చేసే ప్రతి పోస్టు, ప్రతి షేర్ ఓటుతో సమానమని, నిజాన్ని గణాంకాలతో ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకుందామన్నారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, సిడ్నీ కన్వీనర్ అమర్, తదితరులు పాల్గొన్నారు.

మాతృమూర్తిని మించిన దైవం లేదు

- గణపతి సచ్చిదానంద స్వామీజీ



మాతృమూర్తి జయలక్ష్మి విగ్రహానికి పూజలు చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

రాప్తాడు: సృష్టిలో తల్లిని మించిన దైవం లేదని మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. గణపతి సచ్చిదానంద స్వామి మాతృమూర్తి జయలక్ష్మి మాత జయంతి ఉత్సవాలను రాప్తాడు మండలం బొమ్మేపర్తిలో స్వామీజీ చేతుల మీదుగా వైభవంగా ప్రారంభించారు. ముందుగా ఆశ్రమంలోని జయలక్ష్మి మాతా ఆలయంలో విశేష హోమాలు, కుంకుమార్చనలు, వడిబియ్యం సమర్పణ, దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ.. మాతృమూర్తి ప్రాముఖ్యతను వివరించారు. ఆ సమయంలో ఆయన కొంత ఉద్వేగానికి లోనయ్యారు.

శభాష్ వర్ణిక!



సీఐ సాయిప్రసాద్ సమక్షంలో భాస్కర్‌నాయక్‌కు డబ్బు అందజేస్తున్న వర్ణిక

తాడిపత్రిటౌన్: 'వట్టి మాటలు కట్టిపెట్టోయ్... గట్టి మేలు తలపెట్టవోయ్' అన్న గురజాడ అప్పారావు మాటలను 14 ఏళ్ల బాలిక వర్ణిక ఆచరణలో పెట్టి పోలీసులతో శభాష్ అనిపించుకుంది. వివరాలు... గత నెల 30న తాడిపత్రి మండలం అయ్యవారిపల్లికి చెందిన భాస్కర్ నాయక్ తాడిపత్రిలోని మెయిన్ బజార్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో రూ.9వేలు డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. అయితే బ్యాంక్ ఖాతా నుంచి నగదు డ్రా అయినా.. ఏటీఎం నుంచి రాలేదు. చాలా సేపటి వరకూ ఆయన అక్కడే వేచి చూశాడు. అయినా డబ్బు రాకపోవడంతో విసుగు చెంది వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత అదే ఏటీఎం కేంద్రానికి డబ్బు డ్రా చేసుకునేందుకు యల్లనూరు మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన బాలిక వర్ణిక వెళ్లింది. అయితే అప్పటికే ఏటీఎంలో నగదు కనిపించడంతో ఆశ్చర్యపోయిన బాలిక... చుట్టుపక్కల పరిశీలించింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఆ డబ్బు తీసుకెళ్లి నేరుగా సీఐ సాయిప్రసాద్‌కు అందజేసింది. లెక్కిస్తే రూ.9వేలు ఉన్నాయి. పోలీస్ విచారణలో ఆ డబ్బు అయ్యవారిపల్లికి చెందిన భాస్కర్ నాయక్‌దని గుర్తించిన పోలీసులు శుక్రవారం ఆయనను పీఎస్‌కు పిలిపించి వర్ణిక చేతుల మీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా వర్ణికను పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించారు.

గ్రంథాలయాలు... విజ్ఞాన కేంద్రాలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం: గ్రంథాలయాలు భవిష్యత్తు తరాలకు విజ్ఞాన కేంద్రాలని జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్ హోదాలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అన్నారు. గ్రంథాలయాల అభివృద్ధి అంశంపై జిల్లాలోని 79 గ్రంథాలయాధికారులతో కలసి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం ఆయన సమీక్షించారు. నిర్ణీత సమయానికి గ్రంథాలయాలు తెరచి ఉంచాలన్నారు. గ్రంథాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. గ్రంథాలయా పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ వారి నుంచి నిర్ణీత సమయంలో పన్నులు రాబట్టాలన్నారు. గ్రంథాలయాలను ఆదర్శంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలపై పాఠకులకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారిలో స్వచ్ఛందంగా సేవ చేసే దృక్పథం ఉన్న వారిని రీసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేయాలన్నారు. వీరి నుంచి గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థులకు డ్రాయింగ్, నృత్యం, పెయింటింగ్, సంగీత వాయిద్యాల శిక్షణ అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రెటరీ పి. రమ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో పిల్లలు జాగ్రత్త : డీఈఓ

అనంతపురం ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో పిల్లలను అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వడదెబ్బ బారిన పడకుండా పిల్లలను రక్షించుకోవాలని కోరారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలను బయటకు పంపకుండా చూడాలన్నారు. ఈతకు వెళ్లకుండా నిఘా ఉంచాలన్నారు.

వంచన కేసులో వ్యక్తి అరెస్ట్

ఉరవకొండ: ఉద్యోగం ఇప్పిస్తానంటూ మహిళను వంచించిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలను శుక్రవారం ఉరవకొండ పీఎస్ ఎస్‌ఐ జనార్దననాయుడు వెల్లడించారు. ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన వ్యక్తి తనకు ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి రూ.23 లక్షలు తీసుకున్నాడని ఉరవకొండకు చెందిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అక్షయనందన్ అనే వ్యక్తిపై ఈ ఏడాది జనవరి 28న పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నెల్లూరుకు చెందిన వీరబోయనేని మహేష్ ఆలియాస్ అక్షయ్‌నందన్ శుక్రవారం ఉదయం ఉరవకొండలోని పెట్రోల్ బంకు వద్ద తచ్చాడుతుండగా గుర్తించి అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.70 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

జేఎన్‌టీయూ విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ వర్సిటీ వీసీ డాక్టర్ హెచ్.సుదర్శనరావు తెలిపారు. ఇందు కోసం హైదరాబాద్‌లోని స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషన్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. ఒప్పందంలో భాగంగా ఎక్స్‌పీరిన్సియల్ లర్నింగ్, వర్చువల్ ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ (ఏ) విద్యార్థులకు ఇది చాలా ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకునేలా సాఫ్ట్ స్కిల్స్ అభ్యసించేందుకు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓఎస్డీ టూ వీసీ ఆచార్య ఓ.దేవన్న, రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య, డీఏపీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రొఫెసర్ సి.శోభా బిందు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, స్మార్ట్ బ్రిడ్జి ఎడ్యుకేషన్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు శ్రీ దేవి సిరా పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్ట్

అనంతపురం: మైనర్ బాలిక మిస్సింగ్ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు అనంతపురం నాల్గో పట్టణ పీఎస్ సీఐ కె.సాయినాథ్ తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. కళ్యాణదుర్గం మండలం కొండాపురం గ్రామానికి చెందిన వడిత్యా రామకృష్ణ నాయక్ అనే వ్యక్తి తమ కుమార్తెకు మాయమాటలు చెప్పి తన వెంట పిలుచుకెళ్లాడని, ఇందుకు అదే గ్రామానికి చెందిన కమలాబాయి అనే మహిళ సహకరించినట్లుగా బాధిత తల్లిదండ్రులు పది రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు కళ్యాణదుర్గం మండలం దేవేంద్రపాడులో మైనర్ బాలికను గుర్తించి అనంతపురానికి పిలుచుకువచ్చారు. చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి, రామకృష్ణ నాయక్, కమలాబాయిని అలియాస్ కమలాక్షి బాయిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రాణం బలిగొన్న అతి వేగం



నుజ్జునుజ్జయిన కారు



మృతుడు మంజునాథ్

రాప్తాడు: అతి వేగం ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని దేవనహళ్లి గ్రామానికి చెందిన మంజునాథ్ (44), ప్రతాప్, అమర్‌నాథ్, నగేష్... కేఏ50ఏ 9691 నంబర్ గల కారులో మంత్రాలయ క్షేత్ర దర్శనానికి వెళ్లారు. అక్కడ పూజాదికాలు ముగించుకున్న అనంతరం శుక్రవారం దేవనహళ్లికి తిరుగు ప్రయాణమయ్యారు. రాప్తాడు మండలం రామినేపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై అతి వేగంగా వెళుతున్న కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పల్లంలోకి పల్టీలు కొడుతూ బోల్తాపడింది. ఘటనలో కారు నడుపుతున్న మంజునాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రతాప్, అమర్‌నాథ, నగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వారు గుర్తించి క్షతగాత్రులను 108 వాహనం ద్వారా అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జిల్లా వ్యాప్తంగా..

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

అనంతపురం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 శిబిరాలు ఏర్పాటు చేయగా, ఇందులో బాలురకు 25, బాలికలకు 25 చొప్పున శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 31 వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అనంతపురంలోని ఎస్‌ఆర్ స్టేడియంతో పాటు బూదగవి – ఉరవకొండ, తాటిచెర్ల, అనంతపురం, తరిమెల, నార్పలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో వాలీబాల్ శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లుగా తెలిపారు. అన్ని క్రీడలకు ఉచిత శిక్షణ ఉంటుందని, అనంతపురంలోని చంద్రప్రభ స్విమ్మింగ్ పూల్‌లో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ శిబిరంలో మాత్రం నామమాత్రపు రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న 8 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న పిల్లలు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలన్నారు. పూర్తి వివరాలకు 08554–315632లో సంప్రదించాలని కోరారు.

క్రీడా శిబిరాలు ఇలా...

క్రీడ	శిబిరం
అథ్లెటిక్స్	ఎస్‌ఆర్ స్టేడియం – అనంతపురం, జూనియర్ కళాశాల – పామిడి, రైల్వే గ్రౌండ్ – గుంతకల్లు.
ఆర్చరీ	విద్యానగర ఓరియటల్ స్కూల్–అనంతపురం, ఆన్‌సెట్ కార్యాలయం–అనంతపురం.
బాస్కెట్‌బాల్	ఇండోర్ స్టేడియం – అనంతపురం, ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాల – అనంతపురం, ప్రభుత్వ జూనియర్ కళాశాల – ఉరవకొండ, పీటీసీ – అనంతపురం.
ఫుట్‌బాల్	డిగ్రీ కళాశాల – అనంతపురం.
ఫెన్సింగ్	విద్యారణ్య ఓరియంటల్ స్కూల్ – అనంతపురం, సేతు స్కూల్ – అనంతపురం, ఇండోర్‌స్టేడియం – అనంతపురం.
హ్యాండ్‌బాల్	కేవీకే – కళ్యాణదుర్గం, జెడ్పీహెచ్‌ఎస్ – చిప్పగిరి – కళ్యాణదుర్గం మండలం.
హాకీ	కేవీకే – కళ్యాణదుర్గం, డిగ్రీ కళాశాల – అనంతపురం
జూడో	ప్రభుత్వ జూనియర్ కళాశాల – అనంతపురం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల – ఆర్‌ఎస్ రోడ్డు – గుత్తి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల – పెనకచర్ల డ్యాం – గార్లదిన్నె మండలం, జీవీపీ కాలనీ – తాడిపత్రి, జెడ్పీహెచ్‌ఎస్ – కళ్యాణదుర్గం.
కబడ్డీ	ఎస్‌ఆర్ స్టేడియం – అనంతపురం, ఎస్‌ఎస్‌బీఎన్ – అనంతపురం, శివ టెంపుల్ – తాడిపత్రి, విజన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ – యాడికి, ఎస్‌జేపీ మున్సిపల్ స్కూల్ – గుంతకల్లు.
కర్రసాము	ఆర్ట్స్ కళాశాల – అనంతపురం.
ఖోఖో	జెడ్పీహెచ్‌ఎస్ – రాప్తాడు.
టేబుల్‌టెన్నిస్	ప్రభుత్వ జూనియర్ కళాశాల – ఉరవకొండ.
తైక్వాండో	శ్రీచైతన్య స్కూల్ – పామిడి, రాజీవ్ చిల్డ్రన్ పార్క్ – అనంతపురం, ప్రగతి పార్క్ – రాంనగర్ – అనంతపురం, వివేకానంద పార్క్ – అనంతపురం, ఎంబీ తైక్వాండో అకాడమీ – అనంతపురం.
రైఫిల్ షూటింగ్	విద్యారణ్య స్కూల్ – కొవ్వూరు నగర్ – అనంతపురం
రెజ్లింగ్	ప్రభుత్వ జూనియర్ కళాశాల – పామిడి.
షటిల్	ఇండోర్ స్టేడియం – అనంతపురం.
వెయిట్‌లిఫ్టింగ్	జెడ్పీహెచ్‌ఎస్ – తాటిచెర్ల – అనంతపురం.

తగ్గని వాంతులు.. విరేచనాలు

ఉరవకొండలో రోజురోజుకూ పెరుగుతున్న అతిసారం బాధితుల సంఖ్య



ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఉరవకొండ: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. వారం రోజులుగా ఇదే పరిస్థితి. సాధారణ రోజుల్లో ఓపీ 400 కాగా, ఈ వారం రోజులుగా 500కు చేరుకోవడం గమనార్హం. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ పిల్లలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకుంటున్నారు. కేవలం వాంతులు, విరేచనాలకు సంబంధించి రోజూ 60 నుంచి వంద మంది ఆస్పత్రి పాలవుతుండడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది.

లోపం ఎక్కడ?..

ఉరవకొండలో అధిక శాతం ప్రజలు వాంతులు, విరేచనాలతోనే ఆస్పత్రికి చేరుకుంటున్నారు. అయితే ఇందుకు కలుషిత నీరే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా ఉరవకొండలోని పలు కాలనీలకు తాగునీరు సరఫరా అవుతోంది. కొన్ని రోజులుగా ఈ నీరు రంగుమారి వస్తోంది. దీనికి తోడు మేజర్ పంచాయతీ పరిధిలో ఎటు చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది.

తాగునీళ్లు బాగాలేవు



తాగునీటిలో మురుగు నీరు కలిసి వస్తున్నాయి. అధికారులతో ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోంది. తాగునీటిని శుద్ధి చేయడం లేదు. గతి లేక ఆ నీరే తాగి ఆస్పత్రి పాలవుతున్నాం.

– పోలమ్మ, నింబగల్లు

వారం రోజులుగా వాంతులు



వారం రోజులుగా నేను వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నా. నయమైనట్లుగానే ఉంటుంది. అయినా వాంతులు, విరేచనాలు తగ్గలేదు.

– ఎర్రిస్వామి, మోపిడి

క్లుప్తంగా

ఆటోను ఢీకొట్టిన బస్సు

• వ్యక్తికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న ఈశ్వర్ బాబు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని యర్రంపల్లి–నాగసముద్రం గేట్ గ్రామాల మధ్య 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. అనంతపురం నగరం తపోవనం కాలనీకి చెందిన ఈశ్వర్ బాబు అనే వ్యక్తి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఫ్లెవుడ్, అద్దాలను బాడుగకు మాట్లాడుకుని హిందూపురం బయలుదేరాడు. ఆటో యర్రంపల్లి–నాగసముద్రం గేట్ గ్రామాల మధ్యకు చేరుకోగానే.. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఆటోను వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడటంతో ధ్వంసమైంది. బస్సు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. ఈశ్వర్ బాబుకు ఎడమ కాలు విరిగింది. తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడ్ని హుటాహుటిన చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

అరుణ మృతి తీరనిలోటు


అరుణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) ఉమ్మడి రాష్ట్రం కమిటీలో రాష్ట్ర కోశాధికారిగా పని చేసిన సి.అరుణ మృతి తీరనిలోటని ఆ సంఘం నాయకురాళ్లు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న అరుణ శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమె మృతికి ఐద్వా నాయకురాళ్లు సంతాపం ప్రకటించారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అరుణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి డాక్టర్ ప్రసూన, డాక్టర్ ప్రగతి మాట్లాడారు. మహిళ్లపై వివక్ష, జరుగుతన్న అత్యాచారాలకు వ్యతిరేకంగా అరుణ ఉద్యమించడంతో పాటు మహిళలను చైతన్యపరిచారన్నారు. చంద్రిక, రామాంజనమ్మ, అశ్విని, పాల్గొన్నారు.

ఎస్సీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సీ మునిసిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌బాబు కోరారు. శుక్రవారం కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం అందజేశారు. నగరపాలక సంస్థలో మునిసిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులతో కమిషనర్ సమావేశమయ్యారు. వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌బాబు మాట్లాడుతూ.. మహిళా కార్మికులకు 20 రోజుల క్యాజువల్ లీవ్స్‌ను మంజూరు చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా ఉంటూ మరణించిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని కోరారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. తమ పరిధిలో ఉన్న వాటిని సకాలంలో జరిగేలా చూస్తామని తెలిపారు.

బాలికా విద్యతోనే వికాసం


కిశోర వికాసం పోస్టర్లను విడుదల చేస్తున్న సీడీపీఓ ధనలక్ష్మి

రాప్తాడు: విద్య ద్వారానే బాలికల వికాసం సాధ్యమని అనంతపురం రూరల్ ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో కిశోర వికాసం పేరుతో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత కిశోర బాలికలు ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బాలికలు క్రమశిక్షణతో మెలుగుతూ బాగా చదువుకుని స్వశక్తితో నిలబడాలని సూచించారు. పోక్సో చట్టం, బాలల హక్కులు, లింగ వివక్షత తదితర అంశాలపై తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్, సోషల్ వర్కర్ వెంకట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ వర్కర్లు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

అనంతపురం కల్చరల్: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమంలో శుక్రవారం కామాక్షి అనే మహిళకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో నిత్యసురభి ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ నిర్మల మురళీ పాల్గొన్నారు.


నగరంలో కురుస్తున్న వర్షం


చీకట్లోనే వాహనాల రాకపోకలు


వర్షంలోనే వెళ్తున్న వాహనదారులు

కురిసింది వాన.. అనంతలోన

నగరంలో శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అంతకు ముందు పెద్ద ఎత్తున గాలులు వీచాయి. వర్షం జోరుగా కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వాహనదారులు చీకట్లోనే రాకపోకలు సాగించారు. గాలీవానకు పలుచోట్ల చెట్లు పడిపోయాయి. టవర్‌క్లాక్ వద్ద హోర్డింగ్స్ లేచిపోయాయి. సప్తగిరి సర్కిల్‌లో పోలీస్ డివైడర్లు పడిపోయాయి. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు కొంత ఉపశమనం లభించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


టవర్‌క్లాక్ వద్ద పడిపోయిన హోర్డింగులు


సప్తగిరి సర్కిల్‌లో పడిపోయిన పోలీస్ డివైడర్లు


గాలీవానకు భవనంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చిరిగిపోయిన దృశ్యం

సేవ్ ఆర్డీటీ–సేవ్ అనంత


ఆందోళన చేస్తున్న ఎంపీపీ హేమలత, తదితరులు


అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న అఖిల పక్ష కమిటీ సభ్యులు

ఆత్మకూరు: ఆర్డీటీ సేవలు కొనసాగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని ఎంపీపీ సుబ్బర హేమలత, ఆత్మకూరు సర్పంచ్ ఎగ్గిడి వరలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మకూరులో సేవ్ ఆర్డీటీ–సేవ్ అనంత కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కనకదాస కల్యాణ మండపం మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. ఆత్మకూరు ప్రధాన రహదారిలో మానవహారంగా ఏర్పడి ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. కరోనా సమయంలో ఆర్డీటీ ఆసుపత్రుల్లో అందించిన సేవలు మరువలేనివని తెలిపారు. నేటికీ వైద్య సేవలు నిర్విరామంగా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్ రెడ్డి, ఆత్మకూరు సర్పంచ్ ఎగ్గిడి వరలక్ష్మి, ఓబులేసు, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, వన్నూరప్ప, అంజినప్ప, ఓబీ టైలర్ వెంకటేష్, రాజశేఖర్, కంటెన్నగారి వెంకటేష్, ఓబయ్య, నరసింహులు, నాగరాజు, రత్నమ్మ, మహేష్, సింగంపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ పరిరక్షణకు ఆందోళన బాట

అనంతపురం: ఆర్డీటీ పరిరక్షణే ధ్యేయంగా ఈనెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. ఇందుకు ముందస్తు అనుమతి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం అఖిలపక్ష కమిటీ సభ్యులు అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అభివృద్ధి, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సేవలందిస్తున్న ఆర్డీటీ పరిరక్షణకు ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. ఆర్డీటీకి విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరైన చర్య కాదన్నారు. దీక్షలకు రాజకీయ, వామపక్ష పార్టీలు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, రామన్న, ఓబులేసు, మందల రమేష్, సాకే చిరంజీవి, కొట్ల గంగాధర్, కేపీ రాజు, సాకే బాల పెద్దన్న, దాసరి ఆదినారాయణ, సుగామంచి శ్రీనివాసులు, బేడ బుడగ జంగం అంజి, రవి నాయక్, పూసల హనుమంతు, రామకృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉగ్రదాడి అనాగరిక చర్య


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: ఉగ్రదాడి అనాగరిక చర్య అని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదం ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రదాడిని నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం స్థానిక నాల్గవ రోడ్డులోని చాందినీ మసీద్ నుంచి నడిమివంక వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉగ్రదాడిని ఖండించడమే కాకుండా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. కొందరు హిందూ, ముస్లింల పేరుతో విభజన తీసుకొచ్చి దేశాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఐక్యతకు ప్రమాదం తెస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వాటిని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో మసీదు పెద్ద మునీర్ బాషా, హారన్‌సాబ్ రషీద్, షబ్బీర్, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ప్రకాష్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి వలి, ఇస్మాయిల్, దాదు, అజాది మసూద్ గరీబ్ ది ట్రస్ట్ జిలాన్, ఇన్సాఫ్ నాయకులు బంగారుబాషా, బీమేష్, ఐఎంఎం బాషా, జాకీర్, మానవ హక్కుల జాకీర్ సాహెబ్, నిస్సార్, మైనారిటీ పెద్దలు, పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధర్మోపనయనాలు


నగరోత్సవంలో పూజలందుకున్న ఆదిశంకర భగవత్పాదులు

అనంతపురం కల్చరల్: నగరంలోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం ప్రాంగణంలోని జగద్గురు శంకర భగవత్పాదుల సన్నిధానంలో సామూహిక ధర్మోపనయనాలు శుక్రవారం శాస్త్రోక్తంగా సాగాయి. బ్రాహ్మణ ఉపనయన సేవా సమితి ఆధ్వర్యంలో ఉదయం 33 మంది త్రిమత బ్రాహ్మణ వటువులకు వేదపండితులు ముక్తాల విద్యాధరశాస్త్రి బృందం వేదమంత్రోచ్చాటన నడుమ సంప్రదాయరీతిలో ధర్మోపనయనాలు చేయించారు. ఉదయం అభిషేక సేవలు, స్వామివారి ప్రాకారోత్సవం, మహా మంగళహారతి అనంతరం బ్రహ్మోపదేశ కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు తరలివచ్చి వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం వేలాది మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఉపనయన సేవా సంఘం ప్రతినిధులు సాయి శివరాం, రఘురామారావు, శ్రీనిధి రఘు, రాఘవేంద్రజోషి, సతీష్ తదితరులు పాల్గొన్నారు. శారదానగర్‌లోని శారదా శృంగేరి శంకర మఠంలో ఆదిశంకరుల జయంతి సందర్భంగా మఠంలో కొలువుదీరిన చంద్రమౌళీశ్వర స్వామికి ఏకవార రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, పాదుక పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గత వారం రోజులుగా సాగుతున్న శ్రీశంకర విజయం పారాయణం శుక్రవారం ముగిసింది. సాయంత్రం పాదుక ప్రదక్షిణ అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

పంపనూరులో..

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాబు, అర్చకులు పాల్గొన్నారు.

అభాగ్యుడికి 'అమ్మ' ఆసరా


వెంకటేష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ కుటుంబానికి అమ్మ సంస్థ ఆర్థికసాయం అందజేసి, అండగా నిలిచింది. వివరాలు.. కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన వెంకటేష్, భార్య పద్మావతి, కూతురు మధుప్రియతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు. ఇటీవల వెంకటేష్ రెండు కాళ్లకు వాపులు వచ్చి చచ్చుబడ్డాయి. ఆస్పత్రులు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. సర్జరీ చేస్తే నయం కావచ్చని.. అందుకు రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దిక్కుతోచని స్థితిలో అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డిని కలసి సమస్యను చెప్పుకున్నారు. స్పందించిన ఆయన శుక్రవారం తక్షణసాయంగా రూ. 20 వేలు విలువైన నిత్యావసరాలు, రూ.10 వేలతో నూతన వస్త్రాలు అందజేశారు. కర్నూలు ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేయించారు. మందుల కోసం రూ.10 వేలు అందజేశారు. రమణారెడ్డి మాట్లాడుతూ.. వెంకటేష్ కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా ఉంటామన్నారు. దాతలు కూడా ముందుకు రావాలని సూచించారు.

బాలింతలంటే ఇంత అలుసా?


డీఈఐసీ ఎదుట భోజనాన్ని అందుకుంటున్న బాలింతలు

అనంతపురం మెడికల్: గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో బాలింతల పట్ల అంతులేని నిరాదరణ వ్యక్తమవుతోంది. సర్వజనాస్పత్రిలోని డైట్ నిర్వాహకుడి బాధ్యతారాహిత్యం కారణంగా ఒక్క పూట భోజనం కోసం పచ్చి శరీరంతో బాలింతలు నానా అగచాట్లు పడుతున్నారు. సర్వజనాస్పత్రిలో ఎస్ఈఎన్‌సీయూ (నవజాతా శిశు కేంద్రం)లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పసికందులను అడ్మిట్ చేస్తారు. ఈ సమయంలో పిల్లలకు పాలిచ్చేందుకు బాలింతలను వార్డు సమీపంలో పైభాగంలో ఉంచుతున్నారు. వారికి భోజనాన్ని అక్కడికే చేర్చాల్సి ఉంది. అయితే సర్వజనాస్పత్రిలో ఈ పరిస్థితి లేదు. డైట్ కోసం వారు డీఈఐసీ వద్దకెళ్లి మండుటెండలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. పచ్చి శరీరంతో అపరిశుభ్ర వాతావరణంలో ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే ప్రమాదముందని తెలిసినా సంబంధిత వైద్యాధికారులు చర్యలు తీసుకోవడం లేదు. డైట్ నిర్వాహకుడికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చెల్లిస్తోంది. అయితే బాలింతలకు అందజేస్తున్న డైట్‌లో నాణ్యత లోపించినట్లుగా ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పందించి బాలింతలకు నాణ్యమైన సేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఐసా విజయంపై హర్షం

అనంతపురం: జేఎన్‌యూ సెంట్రల్ వర్సిటీ, న్యూఢిల్లీలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఐసా విజయం సాధించడంతో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఐసా రాష్ట్ర అధ్యక్షుడు వేమన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలకు మద్దతు ఇచ్చే వారికి ఐసా విజయం చెంపపెట్టులాంటిదని విమర్శించారు. కార్యక్రమంలో ఐసా జిల్లా కన్వీనర్ కే.బాలకృష్ణ, వర్సిటీ సెక్రెటరీ కృష్ణ, నాయకులు యామన్న, ఆనంద్, అశోక్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో లాభాలు

ఆత్మకూరు: స్థిరమైన దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు సాధించడానికి భూసార పరీక్షలు చేయించాలి. భూమిని బట్టి ఎరువులు వాడాలి. ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పక చేయించాలని జిల్లా భూసార పరీక్ష కేంద్రం నుంచి వచ్చిన వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ముట్టాల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సమక్షంలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొలం నుంచి సేకరించిన మట్టిని వివిధ భౌతిక రసాయనిక పద్ధతుల ద్వారా విశ్లేషించి లక్షణాలు తెలుసుకుని.. ఎంత మోతాదులో ఎరువులు వాడాలో తెలుసుకోవడమే భూసార పరీక్ష అని తెలిపారు. దీని వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. పొలంలో ఏ పంటలు పండించవచ్చో తెలుసుకోవచ్చన్నారు. పోషక స్థాయి తెలుస్తుందని.. ఎరువులు ఎంత మోతాదులో వాడాలో.. ఎప్పుడు వేయాలో తెలుస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎరువులు వేసిన నెల రోజుల వరకూ మట్టి నమూనాలు సేకరించకూడదన్నారు. పంట కోత తర్వాత తీయవచ్చని తెలిపారు. అంతేకాకుండా మట్టి నమూనాలు చేయడం వల్ల రైతులకు ఎరువుల ఖర్చు పూర్తిగా తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె


కమిషనర్ బాలస్వామికి సమ్మె నోటీసు అందిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం నగరపాలక సంస్థలో కమిషనర్ బాలస్వామికి సమ్మె నోటీసు అందజేశారు. నగరపాలక సంస్థ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని సూచించారు. ప్రైవేటీకరణ విధానాలను నిలుపుదల చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఒక్క రోజు సమ్మె నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి శివకృష్ణ, సమితి సభ్యులు రఫీ, అసేన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్‌తో భేటీ


గోరంట్ల మాధవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సాకే చంద్రశేఖర్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్‌ను శుక్రవారం ఆయన నివాసంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యువజన నాయకులు పెద్ద ఎత్తున కలిశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాధవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు సాకే శ్రీనివాసులు, సాకే మహేష్, కోడూరు రాము, చక్రి నాయక్, కుమార్, రసూల్, అంజి ప్రసాద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ ఎస్ఈగా రామమోహన్ రెడ్డి



అనంతపురం కార్పొరేషన్: పబ్లిక్ హెల్త్ ఎస్ఈగా రామమోహన్ రెడ్డి నియమితులయ్యారు. ఈఈగా ఉన్న ఆయన ఇన్‌చార్జ్ ఎస్ఈగా విధులు నిర్వర్తించే వారు. ప్రభుత్వం పదోన్నతి కల్పించడంతో శుక్రవారం పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజినీర్ల, అసిస్టెంట్ ఇంజినీర్లు, మినిస్టీరియల్ స్టాఫ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం రామమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సూచించారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన


సర్వజనాస్పత్రి ఆవరణలో ఆందోళన చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తించే శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది శుక్రవారం ధర్నా చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక షిఫ్ట్ డ్యూటీకి గైర్హాజరయ్యారు. దీంతో ఆస్పత్రిలోని వివిధ వార్డుల్లో చెత్త తరలించలేదు. అదేవిధంగా సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వర్తించకపోవడంతో రోగులను నియంత్రంచలేకపోయారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు 3 నెలలు, సెక్యూరిటీ సిబ్బందికి 2 నెలల వేతనాలు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కనీసం వేతనం రూ.26,000 ఇవ్వాలని కేంద్రం చెబుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కృష్ణుడు, మనోహర్, నల్లమ్మ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.